క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చీపురుపల్లి: పట్టణంలోని శీతలమాత అమ్మ వారి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. భోగాపురపు వాయునందనశర్మ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి అమ్మ వారికి మండల, మంటప దేవతాహ్వానములు, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతి నిధులు కింతలి లక్ష్మణరావు, కండ్యాన వసంత్‌కుమార్, దీపాల కనకరాజు, జీవిఎస్ఎన్.మూర్తి, చల్లా రవి, కింతలి గిరి, ఆలయ అర్చకులు పులఖండం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులుగా ఎన్నికైన సీతారామరాజు, శంకర్, నాగశంకర్

చీపురుపల్లి: పట్టణంలోని లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రస్తుత లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్.వి.దుర్గారావు తెలిపారు. స్థానిక లయన్స్‌క్లబ్ హాల్‌లో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో 2024–25 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా డి.సీతారామ రాజు, కార్యదర్శిగా కోరాడ శంకరరావు, కోశాధికారిగా కందుల నాగశంకర్‌తో పాటు మిగతా కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరంతా జూలై 1 నుంచి 2025 జూన్ 30 వరకు బాధ్యతలు నిర్వహిస్తారని చెప్పారు. నూతన కార్యవర్గానికి క్లబ్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సర్వేయర్లతో మాట్లాడుతున్న సర్వేశాఖ ఏడీ తివిక్రమరావు

గంట్యాడ: విధుల్లో నిర్లక్ష్యం వహించే రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తప్పవని సర్వేశాఖ ఏడీ తివిక్రమరావు హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేజ్ సర్వేయర్లతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ లో సర్వేయర్ల పాత్ర కీలకమని అన్నారు. భూసర్వే చేయాలని ఎవరైనా రైతులు దరఖాస్తు చేసుకుంటే సకాలంలో సర్వే పూర్తి చేయాలని సూచించారు. చిత్తశుద్ధితో పనిచేయాలని చెప్పారు. మండల సర్వేయర్ పి.అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు



మంత్రి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అంగన్‌వాడీలు

గజపతినగరం రూరల్: రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమలు,సెర్ప్,ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను గజపతినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి అంగన్‌వాడీలు మండల కేంద్రంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా అంగన్‌వాడీలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

డంపింగ్‌యార్డ్ పరిశీలన



డంపింగ్‌యార్డ్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

గజపతినగరం రూరల్: నియోజకవర్గ కేంద్రం గజపతినగరంలోని మామిడిబంద కాలనీలో చంపావతినదిని ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డ్‌ను రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. డంపింగ్‌యార్డ్ నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నామని, ఇబ్బందులు పడుతున్నామని డంపింగ్‌యార్డ్‌కు సమీపంలో ఉంటున్నవారు ఫిర్యాదు చేయడంతో మంత్రి సందర్శించారు. చెత్తను వేసేందుకు తగినస్థలం లేకపోవడంతో ఈప్రాంతంలో వేస్తున్నామని పంచాయతీ కార్యదర్శి జనార్దన్ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వేరే చోట డంపింగ్‌యార్డ్ ఏర్పాటుకు స్థలపరిశీలన చేయాలని తక్షణమే తహసీల్దార్‌కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మార్కెట్‌యార్డ్‌లోని గోదాములను పరిశీలించారు. ఆయన వెంట మండల అధికారులు, టీడీపీ నాయకులు ఉన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

- యువత, విద్యార్థులు చెడువ్యసనాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి
- అవగాహన సదస్సుల్లో జూనియర్ సివిల్ జడ్జిలు ప్రేమలత, విజయచంద్ర, కనకమహాలక్ష్మీ



చీపురుపల్లి: జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ప్రేమలత



గజపతినగరం రూరల్: బాలాజీ పాలిటెక్నిక్ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి కనకమహాలక్ష్మీ



కొత్తవలస: కొత్తవలస హైస్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి విజయ్‌చంద్ర



బొండపల్లి: సాయిసిద్ధార్థ కాలేజ్‌లో అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రభాకరరావు



చీపురుపల్లి: చీపురుపల్లి మూడురోడ్ల జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు



చీపురుపల్లి:చీపురుపల్లిలో పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



చీపురుపల్లి: జీవీఆర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సెబ్ సీఐ జనార్దనరావు



గుర్ల: గుర్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ భాస్కరరావు



దత్తిరాజేరు: షికారుగంజి మోడల్ స్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

చీపురుపల్లి: విద్యార్థులు, యువత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, మంచి లక్షణాలు అలవాటు చేసుకోవడం ద్వారానే అది సాధ్యమని, మాదక ద్రవ్యాల వైపు చూస్తే జీవితాలు నాశన మైపోతాయని జూనియర్ సివిల్ జడ్జి వై.ప్రేమలత అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమరవాణా వ్యతిరేకదినం సందర్భంగా పట్టణంలోని జి.వి.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వ హించారు. అతిథిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు కలిగి ఉన్నా, తయారు చేసినా, సహకరించినా కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.మాదకద్రవ్యాలు తీసుకునే అలవాటు ఉన్న వారితో స్నేహం చేయొద్దని విద్యార్థులకు సూచించారు. న్యాయవాదులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

- అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేకదినం సందర్భంగా స్థానిక ఎస్ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు ఆధ్వర్యంలో చీపురుపల్లిలో భారీర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో కలిసి మూడురోడ్ల జంక్షన్‌లో మానవహారం ఏర్పాటు చేశారు.
- మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) ఆధ్వర్యంలో చీపురుపల్లి జి.వి.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెబ్ సీఐ జె.జనార్దనరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మద్దలి వినోద్ బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో భవిష్యత్ నాశనం

కొత్తవలస: ప్రతీ విద్యార్థికి వ్యసనం ఉండాలని..అయితే అది మంచి వ్యసనం అయి ఉండాలని, చెడు వ్యసనాలకు బానిసగా మారి భవిష్యత్ నాశనం చేసుకోవద్ద ని కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ అథారటీ ఛైర్మన్ ఎస్.విజయ చంద్ర సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేకదినం సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. హెచ్ఎం సీహెచ్.ఈశ్వరరావు, కొత్తవలస కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు దేవి, న్యాయవాదులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.కొత్తవలస పట్టణంలో సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు, పలు కళాశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

లక్ష్యసాధనపై దృష్టిపెట్టాలి

గజపతినగరం రూరల్: యువత, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనపై దృష్టిపెట్టాలని గజపతినగరం జూనియర్ సివిల్ జడ్జి బి.కనకమ హాలక్ష్మీ అన్నారు. అంతర్జా తీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేకదినం సందర్భంగా స్థానిక బాలాజీ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యా పకులు పాల్గొన్నారు.

కేసుల్లో ఇరుక్కోవద్దు

శృంగవరపుకోట: మాదక ద్రవ్యాల వినియోగం, అమ్మకం, అక్రమరవాణా వంటి కేసుల్లో ఇరుక్కుంటే జీవితం నాశనమతుందని, విద్యార్థులు, యువత అటువంటి చర్యలకు దూరంగా ఉండాలని ఎస్ఈబి ఇన్‌స్పెక్టర్ ఏ.సంతోష్ సూచించారు. మాదక ద్రవ్యాలు- వాటి దుష్పరిణామాలు అనే అంశంపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా, అమ్మకం వంటివి జరిగితే టోల్‌ఫ్రీ నంబర్ 14500కు కాల్ చేయాలని చెప్పారు. ప్రిన్సిపాల్ సీహెచ్. కేశవరావు, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ జి.ఈరన్న, కళాశాల లెక్చరర్లు, ఎస్ఈబీ ఉద్యోగులు పాల్గొన్నారు.

- బొండపల్లి: బోడసింగిపేటలోని సాయిసిద్ధార్థ జూనియర్, డిగ్రీ కళాశాలలో గజపతినగరం సీఐ ఎన్.వి.ప్రభాకరరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ కె.లక్ష్మణరావు, కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.
- గుర్ల: యువత మత్తుకు బానిసకావద్దని ఎస్ఐ భాస్కరరావు సూచించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.
- దత్తిరాజేరు: షికారుగంజి గ్రామంలో మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో కలిసి ఎస్.భూర్జవలస ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు, యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారిస్తే జీవితం బంగారమయమవుతుందన్నారు. ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- చీపురుపల్లిరూరల్(గరివిడి): అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమరవాణా వ్యతిరేకదినం నేపథ్యంలో గరివిడి వెటర్నరీ కళాశాలలో డీన్ మక్కేన శ్రీను ఆధ్వర్యంలో గరివిడి ఎస్ఐ ఎల్.దామోదర రావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాస రచన పోటీ లు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.
- గజపతినగరం రూరల్: మత్తుపదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ విద్యార్థులకు అవగాహనకల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు డాక్టర్ మాదవరావు, విజయదుర్గ, షర్మిల, డాక్టర్ శాంతి ప్రియ, రాణి పాల్గొన్నారు.
- మెరకముడిదాం: సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధరాయవలస ఎస్ఐ బి.లోకేశ్వరరావు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేశారు. ప్రిన్సిపాల్ పిల్లా శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి వెటర్నరీ కళాశాలలో మాట్లాడుతున్న ఎస్ఐ దామోదరరావు



కొత్తవలస: సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కొత్తవలసలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు,విద్యార్థులు



శృంగవరపుకోట: ఎస్.కోటలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు



గజపతినగరం రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు



మెరకముడిదాం: సోమలింగాపురంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, పోలీసులు

రూ.10 లక్షల జెడ్పీ నిధులతో అభివృద్ధి పనులు

చీపురుపల్లి: పట్టణంలోని బీసీ సంక్షేమ సమీకృత బాలుర వసతిగృహంలో జిల్లా పరిషత్ నిధులు రూ.10లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో వసతిగృహాన్ని సందర్శించినప్పుడు అనేక సమస్యలు గుర్తించామని, వాటిని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన తక్షణమే రూ.10లక్షలు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఈ నిధులతో వసతిగృహంలో మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణం, విద్యుద్దీకరణ, మోటారు రిపేర్, డార్మటరీల మరమ్మతులు చేపట్టామని తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడిన ఆమె ఇంకా ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. వసతిగృహంలో పూర్తి సౌకర్యాలు కల్పించడం ద్వారానే ఈ ఏడాది అడ్మిషన్లు కూడా పెరిగాయని వసతిగృహ సిబ్బంది స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, పంచాయతీరాజ్ జేఈ రమేష్, వసతిగృహ సంక్షేమాధికారి సత్యనారాయణ, పాఠశాల హెచ్ఎం కంది గోపి, ఉపాధ్యాయుడు తిరుపతిరాజు, ప్రభాత్, చైతన్య, మురళి తదితరులు పాల్గొన్నారు.



వసతిగృహంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ శిరీష, తదితరులు

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



స్వామి వారికి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు, దంపతులు

వేపాడ: స్థానిక శ్రీదేవి,భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం వేదపండితులు స్వామివారి కల్యాణం జరిపించారు. ఎస్. కోట, వేపాడ, వల్లంపూడి, నీలకంఠరాజపురం, దబ్బిరాజుపేట, వీలుపర్తి,ఆతవ, శింగరాయి, ఎస్. కోట, ఆనందపురం తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే గ్రామపెద్దల ఆధ్వర్యంలో 3వేల మంది భక్తులకు అన్నదానం చేశారు.

జీఓ 117ను రద్దుచేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

జామి: జీఓ 117ను వెంటనే రద్దుచేయాలని, ఉన్నత పాఠశాలల్లో 3,4,5 తరగతుల విలీనాన్ని ఉపసంహరించుకోవాలని, పాఠశాలల్లో తెలుగు,ఇంగ్లిష్ మీడియం రెండూ అమలు చేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.స్థానిక అల్లువీధి ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ మండల కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ జామి హైస్కూల్‌లో ఇంటర్మీడియట్ కళాశాల నిర్వహిస్తున్నందున ప్రభుత్వం లెక్చరర్లను నియమించాలని కోరారు. సమావేశం అనంతరం 'ప్రభుత్వ బడిని రక్షించుకుందాం- ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పిద్దాం' అనే కరపత్రాలను విడుదల చేశారు. యూటీఎఫ్ ప్రధానకార్యదర్శి జె.వి.ఏ.వి.ఆర్.కె.ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి.రాజారావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసుదేవరావు, ఎం.తాతం నయుడు, మండల కార్యదర్శులు ఎ.జనార్దనరావు, ఎస్.ముత్యాలు, పి.అప్పలరాజు, పి.రామ లింగేశ్వరరావు పాల్గొన్నారు.

29న పీడీఎస్ బియ్యం వేలం

కొత్తవలస: మండలంలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద 102.72 క్వింటాళ్ల పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని ఈనెల 29వ తేదీన వేలం వేయనున్నట్లు సీఎస్‌డీటీ కె.ఇందిర బుధ వారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కొద్ది నెలల క్రితం పలువురు రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని, సీజ్ చేసి 6ఏ కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. ఈ బియ్యాన్ని వేలం వేస్తున్నామని, ఆసక్తిగలవారు రూ.2వేల నగదు ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.

మెనూ పాటించాలి



వేపాడలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈఓ-2 బాలభాస్కరరావు

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికర భోజనం అందించాలని మధ్యాహ్న భోజన పథ కం నిర్వాహకులకు ఎంఈఓలు జగదీశ్వరరావు, బాల భాస్కరరావు సూచించారు. ఓబలయ్యపాలెం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-1 జగదీశ్వరరావు, వేపాడ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ -2 బాలభాస్కరరావు బుధవారం సందర్శించారు. విద్యార్థుల హాజరు, వారి నోట్ పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

పంచాయతీ కార్యాలయం ప్రారంభం

గుర్ల: మండలంలోని శేషుపేటలో అద్దె పంచాయతీ కార్యాలయాన్ని సర్పంచ్ దొంతల కళావతి, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు, జిల్లా టీడీపీ సెక్రటరీ టి.కిరణ్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. శేషుపేట పంచాయతీ కొత్తగా ఏర్పడింది. ప్రభుత్వ భవనం లేకపోవడంతో అద్దె భవనం తీసుకుని పంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కురుమునెల్లి బంగారునాయుడు, గొర్లె రామునాయుడు , నాగులపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

తక్షణమే పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

లక్కవరపుకోట: మండలంలోని చందులూరు గ్రామంలో తక్షణమే పారిశుద్ధ్య పనులు చేయించాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శిని ఎంపీడీఓ కె.రూపేష్ ఆదేశించారు. గ్రామంలో ఈఓపీఆర్డీతో కలిసి బుధవారం మధ్యాహ్నం ఆయన పర్యటించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా లోపించిందని, వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. రక్షిత మంచినీటి ట్యాంక్ వద్ద మురుగునీరు నిలిచిపోవడాన్ని గుర్తించారు.

వ్యాధుల ప్రబలకుండా చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పీరుబండి హైమావతి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో బుధవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, తరచూ పారిశుద్ధ్య పనులు చేయించాలని, తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేయించాలన్నారు. ఏ గ్రామంలోనైనా వ్యాధులు ప్రబలితే వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, వ్యాధులు అదుపులోకి వచ్చే వరకు శిబిరాలను కొనసాగించాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, ఎంపీడీఓ భవాని, గంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



శృంగవరపుకోట: బొడ్డవరలోర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్యశాఖ సిబ్బంది



కొత్తవలస : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ అసిస్టెంట్ సత్యారావు

శృంగవరపుకోట: పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల చాలా వరకు వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఎస్.కోట పీహెచ్‌సీ కో–లొకేటెడ్ వైద్యాధికారులు బి.శిరీష, ఎన్.మానస అన్నారు. మలేరియా వ్యతి రేక మాసోత్సవంలో భాగంగా బొడ్డవర గ్రామంలో బుధవారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి శిరీష మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉంద న్నారు. నివాస పరిసరాల్లో మురుగు నీరు, చెత్త నిల్వ లేకుండా చూసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. దోమ తెరలు వాడాలని, జ్వరం వస్తే వెంటనే పీహెచ్‌సీ సబ్‌సెంటర్‌లో సిబ్బందిని సంప్రదించాలని చెప్పారు. బొడ్డవర సర్పంచ్ మీనా, దారపర్తి సర్పంచ్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కొత్తవలస: వర్షాకాలం కావడంతో మలేరియా,డెంగ్యూ జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని వియ్యంపేట పీహెచ్‌పీ హెల్త్ అసిస్టెంట్ సత్యారావు సూచించారు. వియ్యంపేట బాలికల ఆశ్రమ పాఠశాల, స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులు- తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని,ఆరుబయట తినుబండారాలను తినవద్దని సూచించారు.హెచ్ఎంలు టి.జయశ్రీ ,జి.సాంబశివ రావు పాల్గొన్నారు.

బాలికల వసతిగృహం సందర్శన

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామ సమీపంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల హాస్టల్‌ను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి బుధవారం సంద ర్శించారు. వసతి గృహంలో మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి భోజనం, ఇతర సదుపాయాలపై ఆరా తీశారు. పాఠశాలలో ప్రస్తుతం 10వ తరగతి వరకు మాత్రమే విద్యాబోధన ఉందని, ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేసేలా చూడాలని ప్రిన్సిపాల్ యు.విజయ్‌కుమార్‌పాత్రో ఎమ్మెల్యేను కోరా రు. చందులూరు గ్రామానికి చెందిన సాహసం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఎం.గణేష్ సమకూర్చిన మూడు కంప్యూటర్లు, ప్రొజెక్టర్, పుస్తకాల ర్యాక్‌ను ఎమ్మె ల్యే చేతుల మీదుగా పాఠశాలకు అందజేశారు.ప్రభుత్వం సమకూర్చిన దుప్పట్లు, నోట్ పుస్తకాలు, ఇతర విద్యాసామగ్రిని విద్యార్థినులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ కొల్లి రమణమూర్తి, మాజీ జెడ్పీటీసీ కె.ఈశ్వరరావు,ఎల్.కోట హైస్కూల్ హెచ్ఎం వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు దుప్పట్లు, నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి